క్లుప్తంగా

మళ్లీ వైఎస్సార్‌సీపీ జెండా ఎగురేద్దాం



నరసరావుపేట: సత్తెనపల్లి, నరసరావుపేట నియోజకవర్గాల్లో మళ్లీ వైఎస్సార్ సీపీ జెండా ఎగుర వేసేందుకు కృషి చేద్దామని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, సత్తెనపల్లి ఇన్‌చార్జి డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవరెడ్డి నిర్ణయించారు. సత్తెనపల్లి ఇన్‌చార్జిగా నియమితులైన భార్గవరెడ్డి గురువారం మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డిని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. సుధీర్‌కు మాజీ ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలియచేశారు. ఒకరినొకరు సహకరించుకుంటూ పార్టీ అభివృద్ధికి పాటు పడాలని నిర్ణయించారు.

ముగిసిన వాలీబాల్ టోర్నమెంట్



వినుకొండ(నూజెండ్ల): సంక్రాంతి పండుగను పురస్కరించుకొని నూజెండ్లలో నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్ బుధవారంతో ముగిసింది. కంభంపాడు, నుజెండ్ల గ్రామాల మధ్య జరిగిన వాలీబాల్ టోర్నమెంట్లో కంభంపాడు మొదటి స్థానం, నుజెండ్ల జట్టు రెండు, మూడవ స్థానాలను దక్కించుకున్నాయి. గెలుపొందిన విజేతలకు మంగళవారం బహుమతులు ప్రదానం చేశారు. మొదటి బహుమతి రూ. 20వేలు డి.ఎల్.డి.ఎ. చైర్మన్ లగడపాటి వెంకట్రావు ప్రదానం చేశారు. రెండవ బహుమతి రూ. 15 వేలు దేవభట్టుని సాంబయ్య ప్రదానం చేశారు. మూడవ బహుమతి రూ.7,500లను కుమార్ స్వామి అందజేశారు. అనంతరం నిర్వాహకులను సత్కరించారు.

తూబాడులో ఘనంగా చర్చి మహోత్సవం




నాదెండ్ల: తూబాడు గ్రామంలోని పునీత వన చిన్నప్ప చర్చి వార్షిక మహోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం ఆర్‌సీఎం మతగురువు ఫాదర్ పెంటారెడ్డి రాజారెడ్డి ఆధ్వర్యంలో దివ్య పూజాబలి నిర్వహించారు. ఫాదర్ ఇన్నారెడ్డి చర్చి విశిష్టతను వివరించారు. స్థానిక ఫాదర్ లింగారెడ్డి లూర్దుమర్రిరెడ్డి ఆధ్వర్యంలో పలు గ్రామాల నుంచి వచ్చిన భక్తులు ప్రార్థనల్లో పాల్గొన్నారు. దైవజనులు క్రీస్తు సందేశాన్ని వినిపించారు. కార్యక్రమంలో ఫాదర్ పూదోట జార్జిశౌరయ్య, బాలిరెడ్డి, చిన్నప్పతో పాటూ పలువురు మత గురువులు, కన్యాస్త్రీలు, గ్రామపెద్దలు పాల్గొన్నారు. కమిటీ స్త్రీలు ఏర్పాటు పర్యవేక్షించారు.

దేశ రక్షణలో సైనికుల పాత్ర విలువైనది



చిలకలూరిపేట: దేశ రక్షణకోసం ప్రాణాలను సైతం పణంగా పెట్టే సైనికులను గౌరవించుకోవాల్సిన అవసరం ఉందని రోటరీక్లబ్ ఆఫ్ చిలకలూరిపేట అధ్యక్షుడు ఆళ్ల వేమనరెడ్డి చెప్పారు. ఇండియన్ ఆర్మీడేను పురస్కరించుకొని బుధవారం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో లెఫ్టినెంట్ కల్నల్ ముద్దన సాంబశివరావును ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వేమనరెడ్డి మాట్లాడుతూ దేశభద్రతలో సైనికుల పాత్ర ఎంతో విలువైనదని వెల్లడించారు. మనందరి రక్షణ కోసం ఎన్నో త్యాగాలు చేసే వారి పాత్ర ఎంతో గొప్పదని కొనియాడారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి ఉప్పుటూరి ప్రసాద్, మాజీ అధ్యక్షుడు తోటకూర వెంకటనారాయణ, గల్లా సాంబశివరావు, చిలుకూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి



నరసరావుపేటటౌన్: రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు రైల్వే ఎస్ఐ వి. శ్రీనివాసరావు నాయక్ బుధవారం తెలిపారు. బాబాపేట బ్రిడ్జి సమీపంలో మంగళవారం సుమారు 60 సంవత్సరాల వయస్సు గల వ్యక్తి పట్టాలు దాటుతుండగా ప్రమాదవశాత్తు రైలు ఢీకొని మృతిచెందాడన్నారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించినట్లు తెలిపారు. మృతుడి ఆనవాళ్లు తెలిసిన వారు రైల్వే పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్ఐ కోరారు.

అ'పూర్వ' సమ్మేళనం



స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం 2007-08 పదవతరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళన కార్య క్రమం నిర్వహించారు. స్కూల్ డేస్‌లలో గడిపిన మధుర జ్ఞాపకాలను స్మరించుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పి తాము ఈ స్థాయికి రావడానికి కారకులైన ఉపాధ్యాయులు రామకృష్ణారెడ్డి, మూర్తి, ఏడుకొండలు, శ్యాంసన్, బాలరాజు, ప్రభాకరరావు, కొండలరావు, కోటేశ్వరరావు, అనిత, సునీత తదితర ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. -రొంపిచర్ల

విరిగి.. ఒరిగింది!



రైల్వే గేటు ఒరిగిన సంఘటన బుధవారం పట్టణంలో చోటుచేసుకుంది. రైల్వే స్టేషన్ సమీపంలోని మొదటి రైల్వే గేటు వద్ద రైలు వస్తున్న సమయంలో సిబ్బంది గేటు వేసే ప్రయత్నం చేశారు. ఆ సమయంలో రెండు గేట్లలోని ఒక గేటు విరిగి కిందకు వాలింది. దీంతో సిబ్బంది అప్రమత్తమై ఆ వైపు వచ్చే వాహనాలను నిలిపి వేశారు. ట్రైన్ వెళ్లిన తర్వాత సిబ్బంది గేటుకు మరమ్మతు చేశారు. - నరసరావుపేటటౌన్

పండుగ ప్రభావం!



గుంటూరు-కర్నూలు రహదారి మార్గంలో వాహనాలు రద్దీ తగ్గటంతో పూర్తిస్థాయిలో నిర్మానుష్యంగా కనిపించింది. ఎప్పుడూ రద్దీగా కనిపించే శావల్యాపురంలోని ప్రధాన మార్గం రెండు రోజులుగా బోసిబోయి కనిపిస్తోంది. పండుగ నేపథ్యంలో అందరూ బంధువుల ఇళ్లకు చేరిపోవడంతో రహదారి ఇలా కనిపిస్తోంది. - శావల్యాపురం

సత్తా చాటారు!



నూజెండ్లలో నిర్వహించిన వాలీబాల్ పోటీలు బుధవారం ముగిశాయి. గెలిచిన వారికి మొదటి బహుమతి రూ. 20 వేలు కంభపాడు జట్టుకు నగదును డీఎల్‌డీఏ మాజీ చైర్మన్ లగడపాటి వెంకట్రావు అందజేశారు. రెండవ బహుమతి రూ.15 వేలు నగదును విజేతలకు దేవాబత్తిని సాంబయ్య, మూడోవ బహుమతి రూ.7.500 కూమారస్వామి విజేతలను నగదు బహుమతులు అందజేశారు. -వినుకొండ(నూజెండ్ల)

నేడు నూజెండ్ల శ్రీరామయోగయ్య స్వామి తిరునాళ్లు

- మూడు విద్యుత్ ప్రభలు ఏర్పాటు
- వేల సంఖ్యలో భక్తులు రాక

వినుకొండ(నూజెండ్ల): నూజెండ్ల గ్రామంలో వేంచేసియున్న శ్రీరామయోగయ్య స్వామి తిరునాళ్ల వేడుకలు గురువారం గ్రామస్తులు సారధ్యంలో అత్యంత వైభవంగా జరగనుంది. కోరిన కోర్కెలు తీర్చే దైవంగా రామయోగయ్య స్వామిని భక్తులు ఆరాధిస్తారు. నూజెండ్ల గ్రామములోనే కాకుండా చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకొని తమ మొక్కులు తీర్చుకుంటారు.

స్వామి వారి విశిష్టత..

ప్రకాశం జిల్లా గుత్తికొండ గ్రామానికి చెందిన రామయ్య మేకలు కాసుకుంటూ గ్రామాల్లో పర్యటించేవాడు. ఒకనాడు యోగుల బృందం తారసపడి రామయ్యకు మంత్రోపదేశం చేయగా, రామయ్య యోగిగా మారి గ్రామాల్లో సంచరించి ప్రజలకు ధర్మరక్షణ కోసం దేశాటన సాగించాడు. అందులో భాగంగా నూజెండ్ల గ్రామంలో కరువు పీడలు ప్రబలటంతో గ్రామస్తులు రామయోగయ్యను సంప్రదించారు. ఈ సమయంలో గ్రామాన్ని సందర్శించి రామయోగయ్య నాలుగు దిక్కులు ఆయన చేతులమీదగా పాదులు ప్రతిష్టించారు. ఆనాటి నుంచి గ్రామంలో ప్రజలంతా సుఖసంతోషాలతో పాటు పాడిపంటలతో ఆనందంగా జీవిస్తున్నారు. వర్షాలు పడకపోయినా విపత్కర పరిస్థితుల్లో పాదులకు జలాభిషేకం చేయటం వలన వర్షాలు పడతాయని భక్తుల విశ్వాసం. అనంతరం రామయోగయ్య ప్రకాశం జిల్లా పొట్లపాడు గ్రామంలో జీవసమాధి అయినట్లు భక్తులు విశ్వాసం. అప్పటి నుంచి ఆయన సంచారం చేసిన గ్రామాల్లో తిరునాళ్ళ ఉత్సవాలు చేయటం ఆనవాయితీగా వస్తుంది. ఇందులో భాగంగా నూజెండ్లలో ఏర్పాటు చేసిన దేవాలయానికి కొప్పరావూరి కాశీవిశ్వనాథం స్వామి వారికి వెండి కిరీటం చేయించి భారీ స్థాయిలో దేవాలయ నిర్మాణ పనులు చేపట్టి ప్రతిఏటా తిరునాళ్ల వేడుకలు వైభవంగా గ్రామస్తులు చేస్తున్నారు. తిరునాళ్ల వేడుకలు సందర్భంగా గ్రామస్తులు మూడు విద్యుత్ ప్రభలను ఏర్పాటు చేస్తున్నారు. ఎస్సై వై.వి.కృష్ణారావు సారధ్యంలో పటిష్టమైన బందోబస్తుతో పాటు భక్తులకు ట్రాఫిక్ సమస్యలు అంతరాయం వాటిల్లకుండా చర్యలు చేపట్టారు. తిరునాళ్లకు వేల సంఖ్యలో స్వామివారిని భక్తులు దర్శించుకుంటారు.



విద్యుత్ దీపాల అలంకరణలో శ్రీరామయోగయ్య స్వామి దేవాలయం



ప్రత్యేక అలంకరణలో స్వామి వారు



గ్రామంలో ఏర్పాటు చేసిన పాదు

స్వామి మహిమాన్వితుడు



శ్రీరామయోగయ్య స్వామి గొప్ప మహిమన్వితుడు. ఈ స్వామివారిని పూజిస్తే సుభిక్షంగా ఉంటామని భక్తుల విశ్వాసం. కొన్ని సంవత్సరాల నుంచి తిరునాళ్ల వేడుకలు చేయటం ఆనవాయితీగా వస్తుంది. కోరిన కోర్కెలు తీర్చే దైవంగా స్వామిని కులమతాలకు అతీతంగా అందరు దర్శించుకుంటారు.

– మేదరమెట్ల రామసుబ్బయ్య, ఆలయ పూజారి

అందరికీ ఇలవేల్పు మా స్వామి



శ్రీరామయోగయ్యస్వామి చాలా కుటుంబాలకు ఇలవేల్పు. ఎన్నో సంవత్సరాలుగా ఈ తిరునాళ్లు వైభవంగా జరుపుతున్నాం. భక్తుల నుంచి సేకరించిన విరాళాలు దేవాలయ అభివృద్ధికి ఊతంగా నిలుస్తున్నాయి. తిరునాళ్లలో గ్రామస్తుల సహకారం బాగా ఉంటుంది.

– ఎండ్లూరి వెంకటేశ్వర్లు, దేవాలయ కమిటీ సభ్యులు

ఘనంగా మకరజ్యోతి వేడుకలు

నరసరావుపేట ఈస్ట్: సత్తెనపల్లిరోడ్డులో వేంచేసియున్న శ్రీఅయ్యప్పస్వామి ఆలయంలో మంగళవారం మకర విలక్కు (మకర జ్యోతి దర్శనం) వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలోని మూలమూర్తికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అలాగే ఎస్ఎస్‌పీ కాలనీలోని శ్రీఅయ్యప్పస్వామి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు, గణపతి హోమం నిర్వహించారు. మధ్యాహ్నం మేళతాళాలు, చెక్కభజనలతో కాలనీ శివాలయం వద్ద నుంచి తిరవాభరణాలను శ్రీఅయ్యప్పస్వామివారి ఆలయానికి తీసుకవచ్చారు. సాయంత్రం ఆరు గంటల సమయంలో తిరువాభరణాలు ఆలయానికి చేరుకున్నాయి. ఆలయ కమిటీ అధ్యక్షుడు కొత్తూరి వెంకటశివవేణుగోపాల్, కార్యదర్శి చేబ్రోలు ఫణికుమార్ పర్యవేక్షించారు.

శావల్యాపురం: మండల కేంద్రం శావల్యాపురంలో వేంచేసియున్న శ్రీకనకదుర్గమ్మ అమ్మవారి దేవాలయ ప్రాంగణంలో సంక్రాంతి వేడుకల్లో భాగంగా అయ్యప్ప స్వామి మకర జ్యోతి కార్యక్రమం మంగళవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. తొలుత అమ్మ వారి సన్నిధిలో ఆలయ పూజారి రావిపాటి సాయి భరత్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. మకర జ్యోతిని గ్రామవాసి ఆర్యవైశ్య సంఘం నాయకులు పద్మనాభుని హనుమంతరావు-అంజమ్మ దంపతులు కుటుంబ సభ్యులచే జ్యోతి ప్రజ్వలన ఘనంగా నిర్వహించారు.

చిలకలూరిపేటలో...

చిలకలూరిపేట: పట్టణంలోని సుభానినగర్‌లో ఉన్న శ్రీ అయ్యప్పస్వామి దేవస్థానంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని మంగళవారం అఖండ మకరజ్యోతి ప్రజ్వలన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. 216 కేజీల ఆవు నెయ్యితో జ్యోతి ప్రజ్వలన గావించారు. కీసరగుట్ట వేద పాఠశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ ఎం.వెంకటరాయశర్మ, విజయవాడ దుర్గా నాగమల్లేశ్వరి దేవస్థానం సిద్ధాంతి సీహెచ్ శ్రీనివాసశర్మ, డాక్టర్ రమణ యశస్వీ, అంబడిపూడి వెంకట సాయి మణిదీప్‌శర్మ, సీహెచ్ సాయి రామ్‌శర్మ, జి.చంద్రశేఖరశర్మ, ఎ.రాజేష్ శర్మ సప్తరుషులుగా ఈ కార్యక్రమంనిర్వహించారు.



చిలకలూరిపేటలో అఖండ మకర జ్యోతి ప్రజ్వలన చేస్తున్న దృశ్యం



వినుకొండలో మకరజ్యోతి ప్రజ్వలన...



నరసరావుపేటలో తిరువాభరణాల ఊరేగింపు

వినుకొండలో...

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని మార్కాపురం రోడ్‌లో ఉన్న అయ్యప్ప స్వామి దేవస్థానంలో మకరజ్యోతి ప్రజ్వలన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జున రావు పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ గుడివాడ చిన్న గురునాథం, ఆలయ కమిటీ సభ్యులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయాలు.. సంబంధాలు పెంచేవే క్రీడలు

యడ్లపాడు: సంక్రాంతి సంబరాల్లో అంబరాన్ని తాకాయి. పుడమి గ్రూప్స్ అధినేత ముత్తవరపు సురేష్‌బాబు, అరుణకుమారి దంపతులు ఆధ్వర్యంలో యడ్లపాడు రచ్చబండ సెంటర్లో సంక్రాంతి, కనుమ రెండురోజులు పాటు రంగవల్లులు, మ్యూజికల్‌ఛైర్స్, లెమన్ అండ్‌స్పూన్, మోకులాగుడు, కుండకొట్టుడు, వెల్‌బేబీషో, దంపతులు మధ్య బక్కెట్ అండ్‌బాల్ తదితర పోటీలు అట్టహాసంగా జరిగాయి. ఈ క్రీడా, సాంస్కృతిక పోటీలకు చిన్నారులు, యువత, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పండగకు ప్రత్యేకమైన హరికథ పారాయణం సంప్రదాయ కళా విశిష్టతను భావితరాలకు తెలియజేస్తూ ఎంతో ఆకట్టుకుంది. ముఖ్యంగా ముగ్గుల పోటీకి విశేష స్పందన లభించింది. సాధారణ రోజుల్లో వేసే వాటికి భిన్నంగా భారీ సైజుల్లో ముగ్గులు వేశారు. చుక్కల ముగ్గులు, మెలికల ముగ్గులు పోటీపోటీగా ఒకరిని మించి మరోకరు ఆకర్షణీయంగా వేశారు. ఎవరికి వారే వినూత్నంగా భారీ ముగ్గులు వేసి రంగులతో తీర్చిదిద్దారు. అన్ని విభాగాల్లో వరుసగా ఐదుస్థానాల్లో విజేతలైన వారికి నగదు, బహుమతులు, షీల్డులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ ముత్తవరపు భార్గవి చౌదరి, అరెకపూడి పృథ్వీగాంధీ దంపతులు, ముత్తవరపు రామారావు, పద్మారావు, నూతలపాటి కాళిదాసు, ముత్తవరపు కృష్ణ, దుద్దల రవీంద్ర, జరుగుల శంకరరావు, షేక్ బాజీ తదితరులు పాల్గొన్నారు.



పోటీలు ప్రారంభిస్తున్న డాక్టర్ ముత్తవరపు భార్గవిచౌదరి, పృథ్వీ దంపతులు

ఎంఆర్‌సీ ఉద్యోగి మృతి



మృతుడు చెన్నయ్య (ఫైల్)

బొల్లాపల్లి: సంక్రాంతి పండుగ రోజు ఇంటి యజమాని మృతితో విషాదఛాయలు అలుముకున్నాయి. మండల వనరుల కేంద్రంలో డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్న మాదినేని చెన్నయ్య (43) మంగళవారంమృతిచెందాడు. గంగులపాలెం గ్రామానికి చెందిన చెన్నయ్య ఎంఆర్‌సీలో డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు.

పండుగ రోజు అనారోగ్యంగా ఉండటంతో వినుకొండ తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారని, గుండెపోటు కారణంగా మృతిచెందినట్లు ఈ మేరకు కుటుంబసభ్యులు తెలిపారు. మృతదేహాన్ని బుధవారం ఎంఈవో -1,2 సయ్యద్ జప్రు ల్లా, కె.పార్వతిలు, ఉపాధ్యాయ సంఘాలు సందర్శించి నివాళులర్పించి కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు.

యువత అన్ని రంగాల్లో రాణించాలి

యడ్లపాడు: భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) 45వ సంక్రాంతి క్రీడా, సాంస్కృతిక పోటీలు బుధవారంతో ముగిశాయి. లింగారావుపాలెం విజన్ ఫౌండేషన్, ఎల్‌డీటీ, ఎన్నారైల సంయుక్త సహకారంతో భోగి పండుగ నుంచి కనుమ వరకు మూడు రోజులు కొనసాగాయి. సైకిల్ స్లో, క్రికెట్, వాలీబాల్, షటిల్ క్యారమ్స్, చెస్, జనరల్ క్విజ్, కుండకొట్టుట, వ్యాసరచన, వక్తృత్వం, కథల పోటీలు, రంగోలి, మోకు లాగుట, మ్యూజికల్ చైర్స్, ఫన్నీ గేమ్స్, వాకథన్, అన్నమయ్య కీర్తనలాపన, కోలాట ప్రదర్శన, ఆకురాతి భాస్కర చంద్ర రచించి వైవీ చౌదరి దర్శకత్వం వహించిన కళానికేతన్(వీరన్నపాలెం) వారి 'రుతువు లేనికాలం' సాంఘిక నాటిక ప్రదర్శనలు వంటి 24 విభాగాల్లో జరిగాయి. ఆయా పోటీల్లో విజేతలకు బుధవారం రాత్రి బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన హైకోర్టు న్యాయవాది నర్రా శ్రీనివాస్ మాట్లాడుతూ యువత రిలీజ్ మూవీలకు అధిక వ్యయాన్ని చేయడం కంటే తామే సొంతంగా సందేశాత్మక, సృజనాత్మక ప్రదర్శనలు గ్రామాల్లో ప్రదర్శించేందుకు ఆసక్తి చూపాలన్నారు. ప్రస్తుతం అవసరం, ఫ్యాషన్ అనుకునే సెల్‌ఫోన్ భవిష్యత్తులో వ్యసనం కాకుండా చేసుకోవాలన్నారు. సర్పంచ్ షేక్ కరీమూన్, గ్రామ పెద్దలు ఆలోకం పెద్దబ్బాయి, చంద్రశేఖర్, నంబూరు నరసింహారావు, పావులూరి శేషగిరి, కట్ట శ్రీహరి, నూతలపాటి కాళిదాసు ప్రసంగించారు.



మోకు లాగుడు పోటీల్లో పాల్గొన్న మహిళలు

- సంక్రాంతి, కనుమ వేడుకలు
- ఆహ్లాదకరంగా గ్రామాలలో సంక్రాంతి సంబరాలు, ఆటల పోటీలు

ఊరంతా సంక్రాంతి సందళ్లు

రొంపిచర్ల: మండలంలో మంగళవారం, బుధవారం మకర సంక్రాంతి, కనుమ పండుగ లను ప్రజలు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించుకున్నారు. హరిదాసుల సంకీర్తనలతో, గంగిరెద్దుల విన్యాసాలతో ఈ పండుగలను అత్యంత వైభవంగా జరుపుకున్నారు.

డాక్టర్ గోపిరెడ్డి కార్యాలయంలో..

నరసరావుపేట: మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి కార్యాలయంలో సంక్రాంతి పండుగరోజున పండుగ సందడి నెలకొంది. పలువురు నాయకులు, కార్యకర్తలు పార్టీ కార్యాలయంలో ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలియచేశారు.

బహుమతులు పంపిణీ

నాదెండ్ల: గణపవరం గ్రామంలో కొలువైయున్న శ్రీ కోదండ రామాలయం కమిటీ ఆధ్వర్యంలో సంక్రాంతి పర్వదినం సందర్భంగా బుధవారం రంగవల్లుల పోటీలు నిర్వహించారు. మొదటి బహుమతి టి.సుమతి, రెండో బహుమతి కె.లక్ష్మీతిరుపతమ్మ, మూడో బహుమతి ఎస్.తులసి, మరో నలుగురు కన్సొలేషన్ బహుమతులు దక్కించుకున్నారు.

ఉమ్మడిగా తరలివచ్చారు!

శావల్యాపురం: సంక్రాంతి పర్వదినం సందర్భంగా మండల కేంద్రం శావల్యాపురంలో గడుపూడి నరసయ్య- పాపమ్మ కుటుంబ సభ్యులు పండుగ వేడుకలు ఉమ్మడిగా మంగళవారం జరుపుకున్నారు. ఈ సందర్భంగా గడుపూడి వెంకట్రాయుడు, భిక్షావతి దంపతులు మాట్లాడుతూ 4 తరాలుకు చెందిన 18 కుటుంబాలకు వారందరం 65 మంది కలిసి ఉమ్మడిగా పండుగ వేడుకలు జరుపుకోవటం ఆనవాయితీగా వస్తుందన్నారు.

నరసరావుపేట ఈస్ట్: సంక్రాంతి పర్వదినాన్ని పట్టణ ప్రజలు సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. వివిధ సంస్థల ఆధ్వర్యంలో మంగళవారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ముగ్గులపోటీ నిర్వహించి బహుమతులు అందచేశారు.

నాదెండ్ల: తెలుగు లోగిళ్లలో అతి పెద్ద పండుగైన సంక్రాంతిని పురస్కరించుకుని గ్రామగ్రామాన సంబరాలు అంబరాన్నంటాయి. దేశవిదేశాల్లో ఉద్యోగ వ్యాపారాల్లో స్థిరపడిన ప్రజలు సొంతూళ్లకు చేరుకోవటంతో గ్రామాలు కళకళలాడాయి.

ఘనంగా గోపూజ

నరసరావుపేట ఈస్ట్: కనుమ పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం సత్తెనపల్లిరోడ్డులోని ఆవుల సత్రంలో టీటీడీ హిందూధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో గోమాత పూజ కార్యక్రమం నిర్వహించారు.

నూజెండ్లలో...

వినుకొండ(నూజెండ్ల): కనుమ పండుగ సందర్భంగా మండల కేంద్రమైన నూజెండ్ల గ్రామములో వేంచేసియున్న గోపూజ కార్యక్రమం బుధవారం భక్తులు ఘనంగా నిర్వహించారు.

అమ్మవారి ఆలయంలో..

నరసరావుపేట రూరల్: ఇస్సప్పాలెం శ్రీ మహంకాళి అమ్మవారి ఆలయంలో కనుమ పండుగను పురస్కరించుకొని బుధవారం గోపూజను నిర్వహించారు.

యడ్లపాడులో...

యడ్లపాడు: సంక్రాంతి, కనుమ పండుగలను మండల ప్రజలు మంగళ, బుధవారాలు రెండు రోజులు ఆనందోత్సవాలతో జరుపుకున్నారు. ఉపాధి, ఉద్యోగాల నిమిత్తం వెళ్లిన వారు, బంధుమిత్రులు, కొత్తఅల్లుళ్లు పల్లెలకు తరలిరావడంతో ఊళ్లన్నీ కళకళలాడాయి.



డాక్టర్ గోపిరెడ్డిని దుశ్శాలువాతో సత్కరించిన పార్టీ ఆర్యవైశ్య నాయకులు



రొంపిచర్లలో రాజుల కల్యాణ మండపం వద్ద నిర్వహించిన ముగ్గుల పోటీలు



శావల్యాపురంలో గడుపూడి కుటుంబ సభ్యులు



లింగారావుపాలెంలో మహాశివుడు, గంగా పార్వతీదేవి ఉత్సవ మూర్తుల ఊరేగింపు



గణపవరంలో బహుమతులు అందిస్తున్న కమిటీ సభ్యులు



నరసరావుపేటలో గోపూజ నిర్వహిస్తున్న భక్తులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళన కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

శావల్యాపురం: పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం మండలంలోని వేల్పూరు గ్రామం జడ్పీ ఉన్నత పాఠశాల్లో 2004లో పదోవ తరగతి చదివిన పూర్వవిద్యార్థులు ఐక్యంగా సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా వివేకనంద పూర్వవిద్యార్థుల కమిటీ చైర్మన్ సంద్రపాటి చలపతిరావు పాల్గొని మాట్లాడుతూ సంక్రాంతి పర్వదినం రోజున ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించుకోవటం మంచి శుభాపరిణామమన్నారు. ఇదే పాఠశాల్లో చదువుకొని వివిధ రంగాల స్థిరపడిన పూర్వవిద్యార్థులు 52 మంది ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం పాల్గొని తమ పాత జ్ఞాపకాలు నెమరువేసుకున్నారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు 8 మందిని ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా పూర్వ విద్యార్థి జ్ఞానేశ్వర ఫౌండేషన్ అధినేత షేక్ జాన్‌సైదా రూ.30 వేల రూపాయల చెక్కును పాఠశాల అభివృద్ధికి పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ గన్నవరపు శ్రీనివాసరావుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు భువనగిరి సుబ్రమణ్యం, జయమ్మ, పునీత, మల్లికార్జునరావు, ప్రసాదు, బాలభాస్కర్, కోటేశ్వరరావు, పూర్వ విద్యార్థులు కార్యక్రమ నిర్వాహకులు తూమాటి చెన్నయ్య, పి.సతీష్.బి.బ్రహ్మం, ఎస్.హరిబాబు, కె.వీరాంజినేయులు,ఎస్.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

వేడుకగా తెప్పోత్సవం

యడ్లపాడు: మకర సంక్రాంతి పర్వదినాన జరిగే గోదా కల్యాణం అనంతరం నిర్వహించే శైవ, వైష్ణవ మతాలకు చెందిన దేవతా మూర్తులు జల విహార వైభవ ఘట్టం అంగరంగ వైభవంగా జరిగాయి. మండలంలోని జాలాది, లింగారావుపాలెంలో సంక్రాంతి పర్వదినాన పండితుల వేదమంత్రాలు..భక్తుల శివగోవింద నామస్మరణల మార్మోగుతుండగా పుష్కరిణీలో సీతారాములు, శివపార్వతులు సుందర అలంకరణలో పుష్కరిణీ విహరిస్తూ భక్తులకు కనువిందు చేశారు. లింగారావుపాలెం నడిబోడ్డున ఉన్న కొలనులో శ్రీగంగాపార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి, సీతారామ దేవస్థానాలు, జాలాది గ్రామంలోని హరహతదత్త క్షేత్రం సమీపానే ఉన్న చెరువులో రుక్మిణీ సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి, గంగపార్వతీ సమేత శ్రీచెన్నమల్లేశ్వరస్వామి ఆలయాల్లోని ఉత్సవ మూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరణ చేసి జలపుష్కరిణి కార్యక్రమం నిర్వహించారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని తిలకించేందుకు ఆయా గ్రామాల ప్రజలతో పాటు సమీప ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి తరించారు. ఆ అపూర్వ ఘట్టాలను తమ ఫోన్లలో సెల్ఫీలు తీసుకుని ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగామ్‌లతో షేర్ చేసుకున్నారు. కార్యక్రమాలను రెండు గ్రామాల్లోని ఆలయాల ధర్మకర్తలు, పెద్దలు, ప్రజలు సమిష్టిగా పర్యవేక్షించారు.

